# పిత్రార్జితం

ఒకరోజు పొద్దున్నే లేచేటప్పటికి గోపీకి ముసలివాణ్ణయ్యా
ననే భ్రాంతి కలిగింది. అప్పటినుంచి అతనికి ప్రపంచంమీద
విరక్తి పుట్టింది. ఏ పనిచెయ్యబోయినా, 'ఎందుకు చెయ్యాలి?'
అనే ప్రశ్న పెద్ద పెద్ద అక్షరాలతో కనబడుతూ వుండేది.
ఏదన్నా ఒక పని చెయ్యటానికి ఉపక్రమించి, ఆపని చేస్తున్నం
దుకుగాను తన్నుచూచి తానే నవ్వుకుంటూ వుండేవాడు.
ఎవరన్నా వచ్చి "జాపాన్ మన దేశంమీదకు దాడిచేసే
ట్టుంది" అంటే "చేస్తే యేం"? అనబుద్ధయ్యేది.

అతని ఈ అవస్థలో ఒక ముసలాయన తనకోసం కంగారుగా
రావటం జూశాడు. గోపీ అప్పుడే పొలికట్టతో పశువుల
కొట్టం బాగుచేసి, గేదెముందు నాలుగు పరకలు వేసి, కాకర
పాదులో వేన్నీళ్ళ స్నానం ముగించాడు. ఆ ముసలాయన్ని
చూసేటప్పటికి గోపీకి ఆశ్చర్యంవేసింది. అతను తన స్నేహితు
డైన శేషాద్రి తండ్రి—అంతేగాని తనకు పరచయస్తుడుకాడు.
ఇప్పుడు తనకోసం ఎందుకు వస్తున్నట్టు?

ముసలాయన గడపలో అడుగు పెట్టీ పెడుతూనే, "నేను
శేషాద్రి తండ్రినండీ" అన్నాడు.

"అవునుమీతో ఎక్కువ పరిచయం లేకపోయినా, మిమ్మల్ని
ఇదివరకు చాలాసార్లు చూశాను. శేషాద్రి బాగున్నాడా ?"
అని అడిగాడు గోపి.

"వాడి సంగతి చెప్పటానికే వొచ్చానండీ!" అని ప్రారంభించాడు. ముసలాయన. "వాడు ఆస్తంతా అమ్మేస్తా నంటున్నాడండీ !"

"ఎందుకు ?"

"డబ్బు పార్టీకివ్వటానికటండీ !" అన్నాడు.

"ఏమిటీ ! ! ? ?"

"అవునండీ; జపా నొస్తుందట ! దాన్ని ఆపటానికి పార్టీకి దస్తు కావాలట ! తను ఆస్తమ్మి పార్టీకి ఇచ్చివేస్తాట్ట !"

ఈ మాటలు వింటూ గోపీ నిలిచిపోయాడు. ఒక్కసారి శేషాద్రి పిల్లలు కళ్ళముందు కనిపించారు. ఇంతా, ఇంతా, ఇంతా — నలుగురుపిల్లలు. గాలిగోపురంఅంతస్తులకుమల్లే వుంటాగు. పెద్దపిల్లవాడికి, పప్పు ఎక్కువ తింటంవల్ల మొన్ననే అజీర్తి చేసింది. చిన్నపిల్లని 'గెరిల్లా' అని ఆవూళ్ళోవాళ్ళు హాస్యంగా పిలుస్తుంటారు. వీళ్ళని ఏంచేస్తాడు ?

"మీరు ఒకసారి మావూరురావాలండీ. మీరు చెపితేగాని వాడు వినడు. వాడి విషయం నాకేమీ దిగుల్లేదుకాని, ఆ పసికూనలున్నారే......" ఈ మాటలు చెబుతూ ముసలాయన కంట తడి పెట్టుకునేటప్పటికి గోపీకి వొళ్ళు మండిపోయింది.

"పదండి; వస్తున్నాను." అన్నాడు.

శేషాద్రి తన్ను గురుతుల్యంగా చూసుకుంటాడే, తనమాట వినక ఏంచేస్తాడు ? శేషాద్రి చెడిపోతూవుంటే తాను చూస్తూ వూరుకుంటాడా ?

## II

ఇద్దరూ ఆ వూరు జేరగానే, ముందు నడుస్తున్న ముసలాయన ఆగి, గోపితో ఇలా అన్నాడు—"మీరు ఈదారిని పదండి. నేను ఇంకొకదారిని వస్తాను. మిమ్మల్ని నేను తీసుకువచ్చినట్లు వాడితో అనకండి—అభిమానపడతాడు." ఈమాటచెప్పి ముసలాయన డొంకదార్న వూళ్ళోకి బయల్దేరాడు. గోపీ ముసలాయన్ని గురించీ, కొడుకుమీద ఆయనకున్న వాత్సల్యాన్ని గురించీ తలుచుకుంటూ, ఇటువంటి తండ్రి మనస్సుని ఖేదపెడుతున్నందుకు శేషాద్రిని మనస్సులో దూషిస్తూ, శేషాద్రి ఇంటికి జేరాడు.

అప్పుడు శేషాద్రి పదిమందికుర్రవాళ్ళని పెట్టుకొని బుర్రకథ రిహార్సల్సు చేయిస్తున్నాడు. "అదిగదిగో పేసిస్టు జపాన్ వస్తూయున్నాదీ……" అని పాడుతున్నాడు. గోపీని చూచి హఠాత్తుగా ఆపివేసి వచ్చి, మర్యాదచేసి కూర్చోబెట్టి, ఫలానా వారొచ్చారని చెప్పటానిక్కామాలు ఇంట్లోకి వెళ్ళాడు. హాల్లో మరొకపక్క పదిమందిముసలివాళ్ళు బుర్రకథ వింటానిగ్గాను కూర్చొనివున్నారు. వాళ్ళల్లో ముసలాయనకూడా వుంటం గోపి చూశాడు. గోపీకి ఆదృశ్యం రవివర్మ వేసిన కృష్ణరాయభారం చిత్రాన్ని జ్ఞప్తికి తెచ్చింది. .ముసలి వాళ్ళంతా తన్ను విచిత్రంగా చూస్తున్నారు. 'మీరు వచ్చిన పని మాకు తెలుసులే!' అన్నట్లు మధ్య మధ్య ముసి ముసి నవ్వులు నవ్వుకుంటున్నారు.

ఇంతలో ఒక ముసలాయన గోపీ దగ్గరకు జరిగి— "ఇంత

అన్యాయం ఎక్కడైనా వుందా? పిత్రార్జితం పాడుజేసు కుంటారా?" అని ముక్కుమీద వేలు వేసుకున్నాడు.

ఈ మాట విని కుర్రవాళ్ళు ఎక్కడి వాళ్ళు అక్కడ లేచి పోయారు.

"ఇదంతా ఒక్కటే జట్టండీ! మీరు గట్టిగా చెప్పండి, వినక ఏమవుతాడో చూద్దాం," అన్నాడు ఇంకొకాయన.

"ఇదెక్కడైనా వుందా? ఉపన్యాసాలిచ్చిన వాళ్ళున్నారు. జైళ్ళకు రెండు మూడుసార్లు వెళ్ళి వచ్చినవాళ్ళున్నారు. ఆస్తి అమ్మి పార్టీకివ్వటం ఏనాడైనా విన్నామా?" అన్నాడు ఇంకొక ముసలాయన.

"పసి కూనలున్నారు," అని కంటతడి పెట్టుకున్నాడు. శేషాద్రి తండ్రి.

"ఊరుకోండి. పరవాలేదు." అని ధైర్యం చెప్పాడు గోపి.

"అదే, మా ధైర్యం!" అన్నారు అంతా ఏకగ్రీవంగా!

శేషాద్రి తండ్రి కంట తడి తుడుచుకున్నాడు.

## III

అవ్వాళ రాత్రి భోజనాల దగ్గఱ, శేషాద్రి భార్య అన్నం వొడ్డించే సందర్భంలో, గోపీ ఈ విషయం కదిలించాడు.

"ఏం శేషాద్రీ, ఏమిటి సంగతులు?"

"ఏమున్నాయండీ?... ..."

"పిల్లా జెల్లా అంతా బాగున్నారా?"

"ఆహా..."

"నువ్వేం చేస్తున్నావ్?"

"ఏముందండీ? ఇకనుంచి పూర్తిగా పార్టీ పనిలోకి దిగుదాం అనుకుంటున్నాను..."

"నేనూ విన్నాను. ఆస్తంతా పార్టీకి ఇచ్చివేస్తున్నావటగా"

"ఇచ్చివెయ్యటం ఏమిటిలెండి! ఏదో పార్టీకి నాకు చేతనైన సహాయం చేద్దాం అనుకుంటున్నాను......"

గోపీ మాట్లాడలేదు. శేషాద్రి భార్య పులుసు వొడ్డిస్తూ వుంటే కలుపుకుంటూ కూర్చున్నాడు. శేషాద్రే మాట్లాడాడు "ఈ పొలం, ఆ స్త్రీవుంది చూశారూ—మహాచెడ్డది. ఒక్కపని చెయ్యనియ్యదుగదా. మొన్న కవులుకివ్వగా మిగిలిన ఎకరంలో కంది వేశాను. ఇప్పుడాఎకరం అమ్మినా, నేనుపెంచిన కంది మినహాయించాలని అనిపిస్తావుంది......"

గోపీకి తన కాకరపాదూ, పొట్లతీగా, గేదా జ్ఞాపకం వొచ్చాయి. ఎక్కడికివెళ్ళినా క్షణక్షణం ఇవి జ్ఞాపకంరావటం, ఏమైనవో—తీగెలు ఏవి పీకినవో, గేదెకి గడ్డి వేశారో లేదో—అనిపించటం, జ్ఞాపకంవచ్చింది.

శేషాద్రి చెప్తూనే వున్నాడు – "ఈపొలం ప్రజల్ని ఇంత రియాక్షనరీగా తయారుచేస్తుంది కాబట్టే రైతులు సోషలిజానికి అంతగా ఎదురు తిరుగుతారు. అందుకనే మహానాయకులంతా దానితో ఎక్కువ సంబంధం పెట్టుకోవలసిందని రైతులకు ఉద్బోధిస్తూవుంటారు......" అన్నాడు.

"మరి నీతండ్రి ఇలాగే అనుకొని నీకీ ఆస్తి ఇవ్వకపోతే వంచేశేవాడివి:" అని అడిగాడు గోపి....

"చిక్కే ఉండేది కాదు...విప్లవసమరంలో ముందుండే వాణ్ణి... ఇప్పుడు ఎలాగూ ఆస్తి అనేది ఒకటి ఉంటం తట స్థించింది గనక సద్వినియోగం చేద్దాం అనుకుంటున్నాను."

శేషాద్రి భార్య మజ్జిగ తీసుకురావటానికి ఇంట్లోకివెళ్ళటం చూచి గోపీ ఇలా అన్నాడు. "నీభార్యా పిల్లల సంగతి ఏమా లోచించావ్ ? ఆస్తి వుండి చదువూ సంధ్యా నేర్చుకోబట్టేగా నువ్వింతటి వాడవయ్యావు. ఆ అవకాశం వాళ్ళకి ఇవ్వటం నీ బాధ్యత కాదూ?..."

"విప్లవం జయిస్తే చిక్కేలేదు. లేకపోతే వీళ్ళంతా కూడా విప్లవసైన్యంలో చేరతారు. దానికి ఆస్తెందుకు? ఆస్తి అడ్డాం కూడా! ఆస్తి ఉండబట్టే నేనీస్థితికి రావటానికి ఇన్నేళ్లుపట్టింది. అదే లేకపోతే అవసరమే వాళ్ళని తయారుచేస్తుంది..." అన్నాడు శేషాద్రి.

ఈ మాటలు విన్న శేషాద్రి భార్య — "పిల్లల దేముంది లెండి? అనుభవం లేకుండా చేసి, ఆస్తి ఇస్తేమాత్రం వుంచు కుంటారా యేమిటి? ఎన్ని చూట్లంలేదు"... అంది.

గోపీ తికమక పడ్డాడు.

లోపల ఆడుకుంటూవున్న — సుద్దపప్పు తిని అజీర్తి చేసు కున్న — శేషాద్రి పెద్దకొడుకు, "విప్లవం వర్ధిల్లుగాక" అని కేక వేశాడు. ఆ కేక విని గెరిల్లాపిల్ల "జపాన్ నశించాలి" అని ఖంగున మోగింది.

గోపీ ఒక్క నిట్టూర్పువిడిచి అన్నందగ్గరనుంచి లేచాడు.

## IV

తెల్లవారి శేషాద్రి తండ్రివచ్చి చూశేటప్పటికి గోపీ లేదు. ముసలివాళ్ళంతా ఒక్కచోట జేరి గుంపు చింపులు పడ్డారు. శేషాద్రి మాత్రం యథాప్రకారం కుర్రవాళ్ళని పోగుజేసి బుర్ర కథ రిహార్సల్స్ మొదలు పెట్టాడు—

"అది గదిగో ఫేసిస్టుజపాన్ వొస్తాయున్నాదీ...

❋